ఎస్‌సి వర్గీకరణ,ముసాయిదా బిల్లుకు మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్‌సి కులాల వర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ మార్చి 2 వ తేదీన తమ రెండో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. వివిధ వర్గాల నుంచి వచ్చిన 71 విజ్ఞప్తులను రెండో విడతలో కమిషన్ పరిశీలించింది. కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. గురువారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినేట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

బిసిల రిజర్వేషన్లను 42 శాతం పెంచే ముసాయిదా బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా న్యాయ నిపుణుల సలహాలతో బిల్లు ముసాయిదాకు తుది మెరుగులు దిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

వేర్వేరుగా ఈ రెండు బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది.

2017లో అసెంబ్లీ ఆమోదించిన రిజర్వేషన్ల పాత బిల్లును వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) ఏర్పాటుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏడు మండలాలు, 56 గ్రామాలతో ఎఫ్‌సిడిఎ ఏర్పాటు కానుంది. మంత్రివర్గ నిర్ణయాలు....

నాగార్జునసాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే మధ్యన ఉన్న దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ ని ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. 36 గ్రామాలను హెచ్‌ఎండిఎ పరిధి నుంచి తొలగించి ఎఫ్‌సిడిఎకు అప్పగిస్తారు.

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ కలిపి 90 పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హెచ్‌ఎండిఎ పరిధిని రీజినల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలనే ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది.

మొత్తం 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్‌ఎండిఎ పరిధి పెరుగనుంది.ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 పాలసీకి కేబినెట్ ఆమోదం

మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి

తెలిపింది.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా కొత్త పాలసీ రూప కల్పన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలు సెర్ప్ అధ్వర్యంలో, పట్టణ ప్రాంతాల్లో మెప్మా అధ్వర్యంలో తమ కార్యకలాపాలు చేపడుతున్నాయి.ఇకపై రాష్ట్రంలోని అన్ని మహిళా శక్తి సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకు రానున్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాల్లోని సభ్యుల రిటైర్మెంట్ వయస్సును 60 ఏండ్ల నుంచి 65 ఏళ్లకు పెంచి.. గ్రూప్ ల్లో చేరే కనీస వయస్సును 18 ఏళ్ల నుంచి 15 ఏళ్ల కు తగ్గించారు. టిటిడి బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బోర్డు ఏర్పాటుకు మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు వీలుగా తెలంగాణ ఛారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ -1987 కు సవరణలు చేయనున్నారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030 కి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 27 స్పెషల్ టూరిజం ఏరియాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయం. మే నెలలో జరిగే మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ లో ఆతిథ్యం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 140 దేశాలు పాలుపంచుకునే ఈ వేడుకలను తెలంగాణకు ప్రపంచంలో పేరు తెచ్చేలా నిర్వహించాలని నిర్ణయం.10954 గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి ఆమోదం.గతంలో విఆర్ఓ, విఆర్ఎలుగా పని చేసిన వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం. గంధమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టిఎంసిల నుంచి 1.41 టిఎంసిలకు తగ్గించాలని నిర్ణయం. శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ సమీపంలో రాయికుంట గ్రామంలో 5.15 ఎకరాల భూమిని 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పారాలింపిక్స్ 2024 కాంస్య పతక విజేత దీప్తి జీవాంజీకి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదించింది. కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాల్లో 361 పోస్టులకు ప్రభుత్వ ఆమోదం. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూట్ సొసైటీ పరిధిలో 330 రెగ్యులర్ పోస్టులకు, 165 అవుట్ సోర్సింగ్ .. మొత్తం 495 పోస్టులకు ఆమోదం తెలిపింది.

సిఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

డిఎస్‌సి-2003 టీచర్లకు ఒపిఎస్

- ముఖ్యమంత్రి అంగీకరించారని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిఎస్‌సి -2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. దీనిపై సిఎం సానుకూలంగా స్పందించారనీ, ఒపిఎస్‌ను వర్తింపజేసేందుకు అంగీకరించారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డిని శాలువాతో సీఎం సత్కరించి అభినందించారు. డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలననుసరించి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై అధికారులతో పరిశీలింపజేసి ఆదేశాలను జారీ చేస్తామంటూ సిఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందింపజేసి ఉన్నతస్థాయి పదోన్నతులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో ఖాళీలు ఏర్పడగానే విద్యార్థులు నష్టపోకుండా వెంటనే పదోన్నతులను ఇచ్చే విధంగా ఉన్న జిఒ నెంబర్ 67ను పునరుద్ధరించాలని కోరారు. 12 ఏళ్లు పూర్తయిన స్కూల్ అసిస్టెంట్, 24 ఏళ్లు పూర్తయిన ఎస్‌జిటిల అర్హతలను పరిశీలించి గెజిటెడ్ హోదా కల్పించాలని సూచించారు. అన్నింటినీ పరిశీలింపజేసి ఆదేశాలను ఇస్తామంటూ సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

అమెరికాతో మైత్రి వీడాలి

- మోడికి సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ దేశాలన్నింటికీ ప్రమాదకరంగా మారుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఖండించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండ్ చేశారు. అమెరికాతో భారత్ మైత్రి బంధాన్నీ వీడాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లానని చెప్పే ఎపి సిఎం చంద్రబాబునాయుడు అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారుల పేరుతో టెకీల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న తీరుపై కనీసం మాట్లాకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ఆక్సిజన్ అందిస్తున్న చంద్రబాబు ప్రధాని మోడిపై ఒత్తిడి తేవాలని కోరారు. అమెరికాకు ఉన్న ధన, సైనిక బలాన్ని అడ్డంపెట్టుకుని ట్రంప్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాలను గుప్పెట్లో పెట్టుకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రయత్నిస్తున్నాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వివిధ దేశాలపై ఆంక్షలను విధిస్తూ అక్కడి ప్రజా ప్రభుత్వాలను కూలదోస్తూ సంపదను కొల్లగొడుతున్నదని విమర్శించారు. భారత్ పట్ల ట్రంప్ నిరకుంశంగా వ్యవహరిస్తుతున్న తరుణంలో ప్రధాని మోడి దేశ ప్రతిష్టను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారుల పేరుతో అక్కడ ఉన్న భారత ప్రజల పట్ల దారుణంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతకరమని అన్నారు. అమెరికాకు ఉపాధి కోసం వెళ్లి అక్కడ ఏళ్ల తరబడి నివసిస్తున్న యువత పట్ల ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. భారత పౌరుల పట్ల ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ మాత్రం అమెరికాతో స్నేహ సంబంధాలను కొనసాగించేందుకు తహతహలాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అతిథిగృహం ప్రారంభం

- ప్రజాధనం వృథా కానివ్వం : కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్ ఆవరణలో ఉన్న స్టేట్ గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఆర్‌అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన భవనాన్ని ఆసాంతం మంత్రులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం క్యాంపు ఆఫీసుగా వినియోగించిన భవనాన్ని ఆధునీకరించి స్టేట్ గెస్ట్‌హౌస్‌గా మార్చి అన్ని వసతులతో ఇంటిని మరిపించేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని అధికారులు, వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులకు, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం కోసం ఈ స్టేట్ గెస్ట్ హౌస్‌ను వినియోగంలోకి తేవడం జరిగిందని వివరించారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిథుల కోసం హోటళ్లల్లో గదులు కేటాయించి ప్రజాధనం వృథా చేయకుండా స్టేట్ గెస్ట్ హౌస్ ను వినియోగిస్తామన్నారు.

బహదూర్‌పురాలో భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీలోని బహదూర్‌పురాలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. లారీ మెకానిక్ వర్క్‌షాప్‌లో చెలరేగిన మంటలు సమీపంలోని చెట్లకు వ్యాపించాయి. దీంతో స్థానికుల తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఇదే మెకానిక్ వర్క్‌షాప్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

నకిలీ కాల్ సెంటర్‌తో మోసాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసగిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన మనస్విని సహా 60 మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 'ఎక్సిటో సొల్యూషన్స్' పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ అనే వ్యక్తులతో కలిసి దీన్ని నిర్వహిస్తున్నారు.

పలువురు ఈశాన్య రాష్ట్రాల వ్యక్తులను ఆమె టెలీకాలర్లుగా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి పోలీసులు 63 ల్యాప్‌టాప్‌లు, 52 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హ్యాక్ అయిన బ్యాంకు ఖాతాలు సరిచేస్తామంటూ వీరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నారు.

నల్లగొండలో బాలుడి కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పట్టణంలో బాలుడు కిడ్నాప్ అయిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్, అహ్మద్ దంపతులు మూడు సంవత్సరాలుగా రోజువారి కూలి పని చేసుకుంటూ ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని గదిలో నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. నాలుగో తేదీ ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్న మూడేళ్ల బాబును గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాబును ఎత్తుకెళ్లిన కిడ్నాపర్ 30 వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు వారు చెప్పారు. నల్లగొండ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ కోరలేదు

- టి జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనకు ఎమ్మెల్సీ టికెట్ కావాలని కోరలేదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి జగ్గారెడ్డి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, పరిస్థితులు అనుకూలించక ఓడిపోయినట్టు తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నాననీ, ఎమ్మెల్సీ కావాలని అడిగే గుణం తనది కాదని తెలిపారు. 2017లో రాహుల్‌గాంధీ సభ ఏర్పాట్ల మీద స్పష్టంగా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరనున్నట్టు చెప్పారు

పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్

- రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు పెట్టండి
- మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల పరిస్థితులున్నాయి. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటాం. ఇక్కడ పెట్టుబడులు పెట్టి "తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కండి" అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ప్రపంచ ప్రఖ్యాత కళ్లజోళ్ల సంస్థ "లెన్స్ కార్ట్" రూ.1,500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఉత్పత్తి కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూ తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా 2,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, లెన్స్ కార్ట్ ప్రతినిధులు చౌదరి, సుమిత్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఉత్పత్తి...

రాష్ట్రంలో నెలకొల్పనున్న "లెన్స్ కార్ట్" ప్లాంట్ రెండేళ్లలో ఉత్పత్తి ప్రారంభించనుంది. నాలుగేండ్లలో పూర్తి కార్యకలాపాలు మొదలవుతాయి. ఇప్పటికే రాజస్థాన్‌లో ఈ సంస్థ ఒక అధునాతన తయారీ యూనిట్‌ను నిర్వహిస్తోంది. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టును ప్రపంచంలోనే అతి పెద్దదిగా భావిస్తున్నారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులు జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్, తైవాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, వియత్నాం, సౌదీ అరేబియా తదితర దేశాలకు ఎగుమతి అవుతాయి.

డిజిటలీకరణతో సేవలు ఇపిఎఫ్ఒ విస్తృతం

- భవిష్యత్‌లో ఎటిఎం నుంచి కార్యకలాపాలు
- కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు సేవలందించే ఇపిఎఫ్ఒ దేవాలయం లాంటిదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు. భవిష్యత్తులో కార్యాలయాలకే రాకుండా డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్టు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఇపిఎఫ్ఒ జోనల్ నూతన కార్యాలయాన్ని మరో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాండవీయా మాట్లాడుతూ..దేశంలో అత్యధిక ఎక్కువ నిధులున్న సంస్థ ఈపీఎఫ్ఓ అన్నారు. ఆ కార్యాలయాలకు వచ్చే కార్మికుల సమస్యలను, క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్మికుల డబ్బుతో సమానంగా కేంద్ర ప్రభుత్వం కూడా నిధులను జమ చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడ పనిచేసేవారైనా నేరుగా బ్యాంకుల నుంచే విత్‌డ్రా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. కార్మికుల సేవల కోసం 201 టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా ప్రారంభించామని చెప్పారు. భవిష్యత్తులో 301 నెంబర్‌తో మరిన్ని సేవలను అందించేలా ప్రణాళిక రూపొందించి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. యుఎఎన్ నెంబర్ ద్వారా కార్యకలాపాలు నిర్వహించినట్టే కార్మికులు సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. భవిష్యత్తులో ఇపిఎఫ్ఒ లావాదేవీలు ఎటిఎం ద్వారా కూడా నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దేశాభివృద్ధికి వెన్నెముక కార్మిక శక్తియేనని పునరుద్ఘాటించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో పనివిధానంలో కూడా మార్పులను తీసుకురాబోతున్నామని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు కోసం అన్ని విధాల సిద్ధంగా ఉండి పనిచేస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..మూడు రోజుల్లోనే క్లయిమ్‌లకు పరిష్కారించేలా నిర్ణయం తీసుకున్న ప్రధాని మోడీ, కార్మిక శాఖ మంత్రి మాండవీయాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే నెంబర్‌వన్ ఈఎస్ఐ ఆస్పత్రిలో హైదరాబాద్‌లో ఉందన్నారు. తెలంగాణలో మరిన్ని ఈఎస్ఐ ఆస్పత్రులు, ఈపీఎఫ్ఓ కార్యాలయాలు కట్టేందుకు స్థలాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ -కామర్స్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఈపీఎఫ్ఓ ప్రయోజనాలను వర్తింపజేయాలని విన్నవించారు. రామగుండం లాంటి చోట్ల స్థలాలు కేటాయిస్తే పనులను మొదలు పెడతామన్నారు.

నా సినీ జీవితానికి వంశీ పునాది

- ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి కల్చరల్

డబ్బింగ్ కళాకారునిగా జీవనం చేస్తున్న నన్ను ఉషా కిరణ్ నిర్మాత రామోజీ రావు ను వోప్పించి ప్రేమించు పెళ్ళాడు సినిమాలో కదా నాయకుడు పాత్ర చేయించిన దర్శకుడు వంశీ నా సినీ నట జీవితానికి పునాది వేశారని ప్రముఖ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అయన దర్శకత్వంలో తాను నటించిన లేడీస్ టైలర్ విజయవంతం కావటం తో ఇక సినీ పరిశ్రమలో వెనక్కి చూడలేదని రాజేంద్ర ప్రసాద్ వంశీకి చాయా గ్రహకుడు రఘుకు ధన్య వాదాలు తెలిపారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్, ప్రముఖ గాయని శారద(అమెరికా) నిర్వహణలో ప్రఖ్యాత దర్శకుడు రచయిత సంగీత దర్శకుడు వంశీ సినీ జీవిత స్వర్ణోత్సవ వేడుక ఆత్మీయంగా జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సంస్థ పక్షాన వంశీ నీ సత్కరించి మాట్లాడారు వంశీ తన సినీ అనుభవాలు ఎన్నిటినో ఆసక్తి కరంగా వివరించారు. అధ్యక్షత వహించిన ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ వంశీ సినిమాలు సంగీత ప్రాధాన్యంగా వుంటాయని అన్నారు శ్రుతి మించని హాస్యం కు వంశీ సినిమాల ప్రత్యేకం అని వివ రించారు వేదిక పై నిర్మాత ఏడిద రాజా వేమూరి సత్య నారాయణ, హరి ఎంవి, రఘు నటి జయ లలిత తదితరులు పాల్గొన్న వేదిక పై వంశీ రామరాజు స్వాగతం పలుకగా శారద అకునూరి వంశీ సినిమాలు పరిచయం చేసారు. సుంకర పల్లి శైలజ సుధామయి నిర్వహణ లో శారద , వేణు రాము ప్రవీణ్ పాడిన వంశీ సినిమాలోని పాటలు ఆకట్టుకున్నాయి.

శ్రీనందిని ఫార్మాపై డిసిఎ దాడులు

- టెటానస్ వ్యాక్సిన్, ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని ఔషధాల హోల్‌సేల్ పంపిణీదారు శ్రీనందిని ఫార్మాపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేసిన తనిఖీల్లో గది ఉష్ణోగ్రతలో టెటానస్ వ్యాక్సిన్, ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను నిల్వ ఉంచినట్టు గుర్తించి సీజ్ చేశారు. సున్నితమైన ఈ ఔషధాలను తప్పనిసరిగా రెండు సెంటిగ్రేడ్ల నుంచి 8 సెంటిగ్రేడ్ల మధ్య రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచాలని అధికారులు తెలిపారు. అప్పుడే వాటి ఔషధ గుణం (ఎఫిషియెన్సీ) ఉంటుందని చెప్పారు. ఎప్పుడైతే గది ఉష్ణోగ్రతలో వాటిని నిల్వ ఉంచుతారో వాటికి ఉండాల్సిన పొటెన్సీ తగ్గిపోతుందన్నారు. ఇలాంటివి ఉపయోగిస్తే రోగుల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడొచ్చని హెచ్చరించారు. వీటి విలువ రూ.10 వేల వరకుంటుంది. శ్రీనందిని ఫార్మా ప్రొప్రయిటర్ మితింటి శ్రీనివాస్ దాడుల సమయంలో అక్కడే ఉన్నారు. తదుపరి విచారణ కొనసాగుతుందని చట్టప్రకారం నిందితులపై చర్యలుంటాయని అధికారులు వెల్లడించారు. హన్మకొండ కెయుసి రోడ్ వినాయక నగర్ లైన్ 3లోని మహిమ క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.80 వేల విలువైన 42 రకాల ఔషధాలను అధికారులు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

హైదరాబాద్ బ్యూరో : ప్రేమించుకున్న ఆ జంట పెళ్లితో ఒక్కటవ్వాలని కలలు కన్నది. కానీ అందుకు కుటుంబ పెద్దలు అడ్డు చెప్పడంతో ఇద్దరూ ప్రాణం తీసుకున్నారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం చిత్యాలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ (24), భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపల్లి అలేఖ్య(22) రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అలేఖ్య తల్లిదండ్రులు ఆమెకు మరో సంబంధం ఖరారు చేయడంతో పెళ్లి కోసం ఒత్తిడి పెరిగింది. అలేఖ్య తనకు దూరమవుతుందని ఆందోళనకు గురైన అరుణ్ గురువారం సాయంత్రం తన స్నేహితుడి ఇంటికి అలేఖ్యను తీసుకెళ్లాడు. అక్కడ వారిద్దరూ చివరిసారిగా మాట్లాడుకున్న అనంతరం గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. "ప్రేమ వ్యవహారం కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నాం. కేసు నమోదు చేసి, తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకుంటున్నాం" అని పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DIST JUDGE, KADAPA
M.V.O.P. No. 542/2024

Devarintla Mallaiah
...Petitioner

Vs

Bochala Babaiah, S/o Not Known, Major, Hindu, Owner of the car bearing No.TS09-EM-5280, residing at NAB 104, AVL Prakruthi Apartment, Puppalaguda, Manikonda, Hyderabad City, Telangana State.
...Respondent No.1

NOTICE

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా వాదికి పై ప్రతివాది యొక్క కారు ఆక్సిడెంటులో కలిగిన గాయములకు గాను వాది, పై ప్రతివాదిపైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 28.03.2025వ తేదీన వున్నది. కావున పై ప్రతివాది 28.03.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వకీలు ద్వారా గాని, లేక ఖుద్దున గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
పి. శ్రీకాంత్‌రెడ్డి, B.A., B.L.,
అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE HON'BLE V JR. CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S.NO. 5297 OF 2023

Between:
Radiant Systems (India) Pvt. Ltd., Rep. by Its Associate Director, Mr. B.Satyanarayana,
...Plaintiff

AND

Mr. Banda Dinesh Reddy & others
...Defendants

To
1.Mr. Banda Dinesh Reddy S/o. B.Gopal Reddy Aged about 22 Years, Occ: Employee Plot No.91 Gokul Enclave, Phase-II Hasthinapuram Saroor Nagar, Hyderabad, Telangana State-500079
2.Smt. B. Jyothi W/o. B.Gopal Reddy Aged about 38 Years, Occ: House Wife Plot No.91, Gokul Enclave, Phase-II Hasthinapuram, Saroor Nagar Telangana State-500079.
3.Mr. Banda Dilip Reddy S/o. B.Gopal Reddy Aged about 36 Years, Occ: Employee Plot No.91 Gokul Enclave, Phase-II Hasthinapuram Saroor Nagar, Hyderabad, Telangana State-500079.

It is hereby notified that the Plaintiff filed the above Suit against you for recovery of amount and the above OS NO 5297 of 2023 is posted to 15-04-2025 for your appearance.

Therefore, you are hereby requested to appear on **15-04-2025** at **10.30** AM before the above said court in the above matter, failing which the matter will be decided ex-parte.

// BY ORDER//

K.GOPAL
G.L.NARENDER
A.V. NARAYANA RAO
R.VIJAYA LAKSHMI
Advocates
#2-3-512/105, Bapunagar, Amberpet, Hyderabad-13.

IN THE COURT OF THE IV ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DIST AT: KUKUTPALLY.
O.S.No. 27-2025

BETWEEN

1. Smt. Nakka Laxmi Devi W/o late Nakka Venkata Janardhan, Aged about 70 years, Occ: Business

2. Mr. Nakka Venkata Viswa Prasad S/o Late Nakka Venkata Janardhan, aged 49 years, Occ: Business, Plaintiff no.1 to 3 are R/o 7-8-222/4, New Goutham Nagar, Ferozguda, Balanagar Mandal, Hyderbad-500011

3. Mr. Nakka Venkata Deepak Kumar S/o Late Nakka Venkata Janardhan, aged 46 years, presently R/o. 20 Mortelle St., Tallawong-2762, NSW, Australia.

4. Smt. Vadhi Pragathi W/o Vadhi Narayana Prasad, and D/o. late Nakka Venkata Janardhan, aged 51 years, Occ:House-wife R/o. 2-35/1, Fathenagar, Hyderabad-500018.
PLAINTIFFS

AND

1. Nakka Narasimha Swamy S/o Late Nakka Mallaiah, aged 60 years, Occ: Business R/o 7-8-228/2, Ferozguda, Balanagar, Hyderabad - 500 011
2. All Concerned. **DEFENDENTS**

TO
All Concerned. **Defendant no.2**

Whereas the above suit is filed by the plaintiffs, to declare them as the legal heirs of the deceased Nakka Venkata Janardhan, who died on 09-02-2024. The said suit stands posted on 26-03-2025 at 10-30 A.M. If any body has got any objections or claims they may appear on the said date and time and file their objections and claims. Otherwise, the matter will be heard and determined.

(BY ORDER OF THE COURT)
R.VINODREDDY
N.VIDYASAGAR,
Advocates, 182/3RT, Vijayanagar Colony, Hyderabad-.500 057
Counsel for Plaintiffs

ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- బాధితురాలికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి
- నేడు, రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు
- 9న కార్మిక, ప్రజా సంఘాలతో "రౌండ్ టేబుల్"
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా వద్ద గల సీఐటీయూ సిటీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాలనీ, నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలనీ, మహిళలకు పని ప్రదేశంలో రక్షణ కల్పించాలనే డిమాండ్లతో కూడిన ఫ్ల కార్డులు పట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఘటనలకు పాల్పడిన వ్యక్తిపై అత్యాచార చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. జగిత్యాల కలెక్టర్, స్థానిక డీఎస్పీ వ్యవహరిస్తున్న తీరు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సర్కార్ తక్షణమే స్పందించకుంటే కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనలో దేశవ్యాప్తంగా పెల్లుబికిన ఆందోళన రాష్ట్రంలో పునరావృతమవుతుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వినర్ ఎస్వీ. రమ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న లేబర్ కోడ్‌లతో పని గంటలు పెరగడమే కాకుండా రాత్రి షిఫ్ట్‌ల్లోనూ మహిళలు పని చేయాల్సి వస్తోందని అన్నారు. ఆ సమయాలను ఆసరా చేసుకొని దుర్మార్గులు శ్రామిక మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం. పద్మశ్రీ, ఎం. వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, ఎం. శ్రావణ్ కుమార్, మీనా, జె. కుమారస్వామి, కిరణ్మయి, యాదమ్మ, జి. కవిత, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్ర వ్యాప్త ఆందోళన

ఆశా వర్కర్ పై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా శుక్ర, శని వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. 9న హైదరాబాద్‌లో కార్మిక, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగ, కార్మికులందరూ భాగస్వాములు కావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.

రంగనాయక సాగర్ నుంచి 6 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలి

- మంత్రి ఉత్తమ్‌కు ఎంపి చామల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగనాయక సాగర్ డీ10 కెనాల్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డి-3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరణ చేయాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జనగామ నియోజకవర్గం దూల్మిట్ట, చేర్యాల మండలాల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్ పట్ల, ఆకునూర్, జూలపల్లి లింగాపూర్, దూల్‌మిట్ట గ్రామాల పరిధిలోని సుమారు 6,000 ఎకరాలకు రంగనాయక సాగర్ డీ10 కెనాల్ కింద సిర్థీకరణ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అక్కడి రైతుల పంటలు ఎండిపోకుండా వెంటనే నీటిని విడుదల మంత్రి అధికారులతో ఫోన్ లో మాట్లాడినట్టు చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పంటలు ఎట్టి పరిస్థితుల్లో ఎండిపోనివ్వకుండా చూస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కొండల్ రెడ్డి, నరసింగ రావు, కంచ రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒక శాతానికి పడిపోయిన జిఎస్‌టి కలెక్షన్

- సిఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత చర్యలే కారణం : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి చేస్తోంది తెలంగాణ రైజింగ్ కాదని, ఫాలింగ్ అని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది కరోనా సమయాన్ని తలపిస్తూ జిఎస్‌టి కలెక్షన్ ఒక శాతం మాత్రమే నమోదు కావడం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి మరో నిదర్శనమని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతుందని చెప్పారు. గత ఆరేళ్లలో జిఎస్‌టి కలెక్షన్ వృద్ధి రేటు (2021 కరోనా సంవత్సరం మినహా) ఎప్పుడూ ఆరు శాతం కంటే ఎక్కువే నమోదు అయిందని గుర్తుచేశారు. హైడ్రా, మూసీ వంటి తలా తోక లేని నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్ల 2024 ఆగస్టు తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణీయంగా తగ్గిందని తెలిపారు. 2024 ఏప్రిల్-నవంబర్, 2023 ఎప్రిల్-నవంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలు పోల్చితే -0.8 శాతం నమోదు అయినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. జిఎస్‌టి ఆదాయంలో తక్కువ వృద్ధి రేటు, రిజిస్ట్రేషన్ల, వెహికిల్ టాక్స్‌లో నెగెటివ్ వృద్ధి రేటు రేవంత్ రెడ్డి పాలన వైఫల్యాన్ని ఎండగడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పి పాలన పై శ్రద్ధ వహించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

లగచర్ల, హకీంపేట 'భూసేకరణ'పై హైకోర్టు స్టే

- భూసేకరణ చేపట్టొద్దని ప్రభుత్వానికి ఆదేశాలు
- రెండు వారాలు కేసు వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లగచర్ల, హకీంపేట భూ సేకరణపై తెలంగాణ హైకోర్టు స్టే విధిస్తూ.. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భూసేకరణ చేపట్టొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. భూసేకరణకు వ్యతిరేకంగా కొందరు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం కేసు విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. రెండు వారాల పాటు కేసును వాయిదా వేసింది.

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. పారిశ్రామిక కారిడర్ ఏర్పాటుకు మొత్తం 1277.35 ఎకరాలు సేకరించనుండగా.. గతంలోనే భూముల సేకరణకు అధికారులు ప్రజాభిప్రాయం చేపట్టారు. హకీంపేట, పోలేపల్లిలో కొంతమంది రైతుల నుంచి భూ సేకరణ చేపట్టగా.. పట్టా భూములున్న రైతులు మాత్రం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులు కొంతమంది అంగీకారం తెలిపారు. లగచర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ కొందరు రైతులు అధికారులపై దాడి చేసిన విషయం విదితమే. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కాడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా పలువురు రైతులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఆ తర్వాత తాము అక్కడ ఫార్మా కంపెనీ పెట్టడం లేదని స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అయితే, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సేకరణ కోసం గత నవంబర్‌లో ప్రభుత్వం నోటిషికేషన్ విడుదల చేసింది. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు, డిటిపితో కూడిన ఇంటి స్థలం, అర్హతను బట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయినా భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రాలేదు. కొందరు రైతులు భూసేకరణకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును గురువారం విచారించిన హైకోర్టు.. నోటిఫికేషన్‌లో ఉన్న భూ సేకరణపై స్టే విధిస్తూ తీర్పును వెలువరించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ భూ సేకరణ చేపట్టొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రెండు వారాల పాటు కేసును వాయిదా వేస్తూ.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది.

విద్యుత్ కార్యాలయంలో ఎసిబి దాడులు

రూ.70 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎడిఇ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ ఎడిఇ రూ.70వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ విద్యుత్ కార్యాలయంలో జరిగింది. చౌటుప్పల్ పట్టణంలో అక్రిట్ ఫార్మా ఘూటికల్ కంపెనీలో ఫ్రీ ఎనర్జీ సోలార్ సిస్టం కాంట్రాక్టర్ వద్ద రూ.70,000 లంచం తీసుకుంటుండగా విద్యుత్ ఎడిఇ గాజుల శ్యాంప్రసాద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఎసిబి డీఎస్పీ జగదీశ్ చందర్ తెలిపారు. కార్యాలయంలో రెండు గంటలకుపైగా తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో శ్యాంప్రసాద్ ఇంటి వద్ద ఇన్‌స్పెక్టర్లు రఘునందన్, వెంకటేష్ తనిఖీ నిర్వహించారు. శ్యాం ప్రసాద్‌ను అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎసిబి ఇన్‌స్పెక్టర్లు రామారావు, వెంకట్‌రావు పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఎసిబి టోల్ ఫ్రీ నెంబర్ 1064, వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్ బుక్, ట్విట్టర్ ద్వారా సమాచారం అందిస్తే అవినీతి అధికారులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని డిఎస్పి తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి త్వరలో కొత్త విధానం

- మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త విధానాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం, వైద్యం, అభివద్ధి, వేతనాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ఒక కొత్త విధానాన్ని తీసుకురావడానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. "ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్" ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లోని సొసైటీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరైయ్యారు. సొసైటీలోని సీనియర్ మహిళా జర్నలిస్టులను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఒక ఉద్యమ ఉత్సాహమన్నారు. వార్తల సేకరణలో మహిళా జర్నలిస్టులు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కుంభకోణాలను బయటికి తీయడానికి కూడా వెనుకాడని ధైర్యవంతులు ఉన్న మీడియా రంగంలో పని చేస్తున్న మహిళలకు సైతం లైంగిక వేధింపులు, వేతనాల్లో అసమానతలు, వివక్ష తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకం అని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మహిళా జర్నలిస్టులను సీతక్క సన్మానించారు. అనంతరం సొసైటీ సభ్యులు, మహిళా జర్నలిస్టులు కలసి సీతక్క ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ దేవులపల్లి అమర్, సొసైటీ కార్యదర్శి రవీంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, సంయుక్త కార్యదర్శి డా. చల్లా భాగ్యలక్ష్మి, కోశాధికారి బి.మహేశ్వర్ గౌడ్, ఎంసి మెంబర్ కమలాకరా చార్య తోపాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పెసా బలోపేతానికి రూ.33 కోట్లు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏజెన్సీ ఏరియాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న పంచాయతీల(షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం-1996 (పెసా)ను రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది. దీని కోసం రూ.33 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. తెలంగాణలోని పలు ప్రాంతాలు ఐదో షెడ్యూల్డ్‌లో పరిధిలో ఉన్న పలు ప్రాంతాలు పెసా చట్ట పరిధిలో ఉన్నాయి.

రాష్ట్రంలో నాలుగు ఐటిడిఎల పిఒల పరిధిలో నలుగురు కో-ఆర్డినేటర్లు పనిచేస్తున్నారు. వారి కింద 600 మంది మొబిలైజర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, కొంత కాలం ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా యాక్టు సరిగా అమలు కావడం లేదనే విమర్శలొస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే ఆదివాసీ ప్రాంతాల్లోని గిరిజనులను, ఆదివాసీలను మరింత చైతన్యపరిచేందుకు, పెసా చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందులో భాగంగానే పెసా కార్యకలాపాల కోసం, సిబ్బంది జీతభత్యాల కోసం రూ.33 కోట్లను రాష్ట్ర సర్కారు విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించడం, ఏజెన్సీల్లోని పంచాయతీలకుండే ప్రత్యేకాధికారాలను సద్వినియోగ పరుచుకునేలా ఆదివాసీ, గిరిజనులను చైతన్యపర్చడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వంటి పనులు జరుగనున్నాయి.

ఆక్సిలో ఫిన్‌సర్వ్ 'ఇంపాక్ట్‌ఎక్స్' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

హైదరాబాద్ : ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మద్దతును అందించడానికి ఇంపాక్ట్ఎక్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఆక్సిలో ఫిన్‌సర్వ్ వెల్లడించింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, నైపుణ్యాలను పెంచే కోర్సులకు వార్షిక విద్యా ఖర్చుకు నిధులు సమకూర్చనున్నట్లు పేర్కొంది. అర్హులైన ఒక్కో విద్యార్థికి రూ.1,00,000 వరకు నిధులు సమకూర్చనున్నట్లు ఆక్సిలో ఫిన్‌సర్వ్ సిఇఒ ఎండి నీరజ్ సక్సేనా తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఆక్సిలో.కమ్ వెబ్‌సైట్ నుంచి సమాచారం పొంది బడ్డీ4స్టడిలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సామాజిక సేవ ముసుగులో మోసాలు

- డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ వసూళ్లు
- జిహెచ్‌ఎంసి, కలెక్టరేట్లకు అమాయకులను తీసుకెళ్లి గాలం
- నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల(నకిలీ) రబ్బర్ స్టాంప్‌లు, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, రూ.లక్షతోపాటు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను ఛత్రినాక, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు అదనపు డిసిపి అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాకకు చెందిన ఎం జ్యోతి, పి సునీల్ సింగ్ సోషల్‌వర్కర్స్‌గా పనిచేస్తున్నారు.

స్థానికులకు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేవారు. అయితే అందులో ఆశించినంత మేరకు డబ్బులు రాకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి లక్షల్లో వసూళ్లు చేయొచ్చని పథకం వేశారు. సంతోష్‌నగర్‌లో కిరాణ దుకాణం యజమాని జి రమేష్, ఛత్రినాకకు చెంది ఎల్ నితిన్ కుమార్‌తో కలిసి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో అమాయకులను టార్గెట్ చేశారు.

వివరాల వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్

వారికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తామని నమ్మించారు. దరఖాస్తుదారులు ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశారు. నమ్మకం కలిగించే విధంగా వారిని మినిస్టర్ క్వార్టర్స్, సచివాలయానికి తీసుకెళ్లేవారు. వారిని బయట కూర్చోబెట్టి మంత్రులు, అధికారులతో పరిచయాలున్నట్టు చెప్పేవారు. జిహెచ్‌ఎంసి, ఎమ్మార్వో కార్యాలయంతోపాటు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలకు తీసుకెళ్లేవారు. అది చూసిన దరఖాస్తుదారులు వారిని పూర్తిగా నమ్మేవారు. ఇదే తరహాలో రెండేండ్ల నుంచి దాదాపు రెండు వందల మందికిపైగా దరఖాస్తుదారులను మోసం చేశారు. అనుమానం రాకుండా కొంత మందికి ఇండ్లకు సంబంధించి (నకిలీ) అలాట్‌మెంట్ లెటర్స్‌ను ఇచ్చారు. అయితే, రెండేండ్లు గడుస్తున్నా వారు చెప్పిన ప్రకారం ఇండ్లు రాకపోవడంతో కొందరు ఆరా తీశారు. దాంతో వారు మోసం చేస్తున్నట్టు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. గతంలో జ్యోతిపై మొఘల్‌పురా, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని అదనపు డిసిపి తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్ రాఘవేంద్ర, కె నాగేంద్రప్రసాద్‌వర్మ, ఎస్‌ఐలు మల్లేష్, కె నర్సిములు, జి అంజనేయులు, ఎన్ నవీన్ తదితరులు ఉన్నారు.

బిఆర్‌ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదు?

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు బిజెపి, బిఆర్ఎస్ మధ్య ఒప్పందాలు బయటపడుతున్నాయని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలిచాక, కాంగ్రెస్‌కు రంజాన్ గిఫ్ట్ ఇచ్చామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బిజెపికి ఇప్పటికే ఎన్నో గిఫ్టులు ఇచ్చామని, త్వరలో మరో గిఫ్ట్ ఇస్తామని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటేసిన ఓటర్లకు, ఆయన కోసం క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు బిఆర్ఎస్, బిజెపి చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు.

పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం

- ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- *ఆశావర్కర్‌పై లైంగిక దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి: కెవిపిఎస్*

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్‌పై లైంగిక దాడి జరిగి వారం గడిచినప్పటికీ పోలీసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు విమర్శించారు. నిందితున్ని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత ఆశావర్కర్ శివరాత్రి రోజు డ్యూటీ పూర్తిచేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఓ వ్యక్తి బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఘటన జరిగి వారమవుతున్నా నేటికీ ఆ కామాంధుడిని పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత ఆశా వర్కర్‌కు మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. ఆ నిందితుడిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి పరిహారం, ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పోలీస్ యంత్రాంగం నిందితునికి అండగా ఉండి, బాధితురాలికి అన్యాయం చేసే వైఖరి అవలంభిస్తున్నట్టు కనిపిస్తోందని విమర్శించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ ఘటనను పౌర సమాజం తీవ్రంగా ఖండించాలని, రాష్ట్రంలో మరో ఘటన జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలకు రెండోరోజు 97.61 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటన విడుదల చేశారు. రెండోరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని తెలిపారు. 4,52,028 మంది దరఖాస్తు చేయగా, 4,40,513 (97.61 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 10,823 (2.39 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. జగిత్యాలలో మూడు, నిజామాబాద్‌లో ఒకటి చొప్పున నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు సంగారెడ్డి, మెదక్, జగిత్యాల, భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పర్యటించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదని స్పష్టం చేశారు.

అకౌంటెంట్ నిర్వచనంలో 'కాస్ట్ అకౌంటెంట్'ను చేర్చాలి

- కేంద్రానికి ఐసిఎంఎఐ ప్రతినిధుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఆదాయపు పన్ను బిల్లును స్వాగతిస్తున్నామని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎంఎఐ) హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ ఛాప్టర్ ఛైర్‌పర్సన్ సిఎంఎ లావణ్య కందూరి, కార్యదర్శి సిఎంఎ ఖాజా జలాలుద్దీన్, కేంద్ర మండలి సభ్యులు సిఎంఎ కెసిహెచ్ ఎవిఎస్ఎన్ మూర్తి పాల్గొని మాట్లాడారు. ఈ బిల్లు ఒక మైలురాయి అయినప్పటికీ.. పన్ను విధానం, అనుసరణ, వ్యయ నియంత్రణ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రణాళికల వంటి ముఖ్యమైన రంగాల్లో కాస్ట్ అకౌంటెంట్ల నైపుణ్యాన్ని గుర్తించాలని వారు కోరారు. ఆదాయ పన్ను బిల్లు 2025లోని సెక్షన్ 515(3)(బి) ప్రకారం.. 'అకౌంటెంట్' నిర్వచనంలో 'కాస్ట్ అకౌంటెంట్'ను చేర్చాలని లోక్‌సభకు సమగ్రమైన మెమోరాండం సమర్పించామని తెలిపారు. 2013 కంపెనీల చట్టం ప్రకారం అంతర్గత ఆడిటర్లుగా అర్హత పొందామన్నారు. ఇది తమ నైపుణ్యాన్ని మరింత రుజువు చేస్తుందని తెలిపారు. సుప్రీం కోర్టు సివిల్ కేసు 29 (2021)లో పేరా 27లో పేర్కొన్న ప్రకారం.. సిఎంఎలు సమర్థంగా సంకలనం చేయగల సామర్థ్యం కలిగి ఉంటారన్నారు.

బిఆర్‌ఎస్, బిజెపి చీకటి రాజకీయాలతో ఎమ్మెల్సీ గెలుపు : డాక్టర్ మల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్, బిజెపి చీకటి రాజకీయాలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి విమర్శించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఎక్కడా చెక్కు చెదరలేదని తెలిపారు. అనేక అవినీతి కేసులున్న కెసిఆర్ కుటుంబం క్విడ్ ప్రో పద్ధతిలో బిజెపి కోసం పని చేస్తున్నదని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచే ఈ ఒప్పందాలు అమలవుతున్నాయని చెప్పారు. బిఆర్ఎస్ లోపాయికారి మద్దతుతోనే బిజెపి ఎనిమిది ఎంపి సీట్లను గెలుచుకుందని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో బిఆర్ఎస్‌కు 22 మంది ఎమ్మెల్యేలున్నా కూడా ఆ ఒప్పందంలో భాగంగా పోటీకి దూరంగా ఉండి బిజెపిని గెలిపించిందని తెలిపారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పట్టణంలో బాలుడు కిడ్నాప్ అయిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్, అహ్మద్ దంపతులు మూడు సంవత్సరాలుగా రోజువారి కూలి పని చేసుకుంటూ ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని గదిలో నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. నాలుగో తేదీ ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్న మూడేళ్ల బాబును గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసినట్టు సిసి కెమెరాలో రికార్డు అయింది. దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాబును ఎత్తుకెళ్లిన కిడ్నాపర్ 30 వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు వారు చెప్పారు. నల్లగొండ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.